అత్తగారూ అరటికాయపొడి

భానుమతీ రామకృష్ణ

"రేపు నిజ శ్రావణంలో వచ్చే వరలక్ష్మీ వ్రతం నాటికి, గెలతోబాటు పిలకల్ని కూడా వేయాలి అరటి చెట్టమ్మా" అంటూ మా అత్తగారు పెరటివేపు తులసికోట వెనక వున్న ఖాళీస్థలంలో మంచి అరటికాయలు కాచే అరటిమొక్క ఒకటి నాటారు... మడిలో వున్నారు గనక మడినీళ్ళ ఓ బిందెడు ఆ అరటిచెట్టుకు పోశారు ఆయుర్దాయం పోసినట్టు—అపక్కనే పందికొక్కు తవ్వి పడేసిన కరివేపాకు మొక్కను పదహారోసారి పాతి తిరిగీ ఆమొక్కకు మడినీళ్లతో ప్రాణప్రదానం చేశారు.

అసలు మా అత్తగారి చేతిమీదుగా ఏదైనా చెట్టూ చేమా నాటితే, పూతా, పిందె సమృద్ధిగా కలిగి చిరంజీవిగా వర్ధిల్లుతుందని మా అత్తగారియొక్క అవ్వగారు అంటూండేదని మా అత్తగారు అంటూటారు అప్పుడప్పుడూ.

కాని మా పెరట్లో చాలా కాలంగా వున్న కాయలుకాయని నాలుగు అరటిచెట్లూ మా అత్తగారు నాటినవే-బహుశా వాటికి ఈ సంప్రదాయం తెలిసిఉండదు.

ఆ చెట్లు కాయలుకాయని కారణం ఏమిటని మా అత్తగారిని అడిగితే, ఆమె ఒక్క చిరునవ్వునవ్వి "అవి కాయలుకాచేజాతి అరటి కాదర్రా... ఒట్టి ఆకులకోసమే వేశాను" అని శెలవిచ్చారు-కాబోలు అనుకున్నాను.

కాని మా పెరటో వున్న కాయలుకాయని అరటిచెట్లయొక్క పిల్లల్ని నాలుగు వీధుల అవతలవున్న తెలిసినవాళ్ళు తీసికెళ్ళారు వాళ్ళ పెరట్లో నాటి పెంచుకోడానికి. కొన్ని మాసాలతర్వాత ఒకరోజు వాళ్ళింటి నుండి కొన్ని నవనవలాడే మంచి అరటికాయలు పంపించారు పనిమనిషిచేత-ఎక్కడివని విచారిస్తే, "మీయింటినుంచి తీసికెళ్ళిన అరటిచెట్ల కాయలేనమ్మా" అన్నదా పనిమనిషి... నేను తెల్లబోయాను. పనిమనిషి చెప్పింది వంటింట్లో వుండే విన్నమా అత్తగారు కాసేపు అక్కడే వనిగా వుండిపోయారు, ఆ పనిమనిషి వెళ్ళిపోయిందాకా... తర్వాత చాలాసేపటికి వంటింట్లోంచి బయటికొచ్చారు.

"పనిమనిషి చెప్పింది విన్నారా?" అన్నాను. "ఆహా...విన్నాను—అదే ఆలోచిస్తున్నాను...బహుశా ఆ నాలుగు అరటిచెట్లూ మన పెరట్లో కాయలు కాయకపోవడానికి కారణం భూదేవి." అన్నారు మా అత్తగారు సీరియస్‌గా ముఖంపెట్టి... రెండవకారణం నీరు పారుదల చాలదు అన్నారు...యీసారి మా అత్తగారు చెప్పిందానిమీద నాకు నమ్మకం కలగలేదు...అసలా అరటిచెట్లు కాయలు కాయకపోవడానికి ఒకవిధంగా మా అత్తగారే కారణం... తెరిపి లేకుండా, తల్లులూ, పిల్లలతో సహా మా అత్తగారి భోజనానికి ఆకులు అందించడంతోనే సరిపోయిందా అరటిచెట్ల జీవితం... కాయలుకాచే అవకాశం మా అత్తగారు యివ్వందే!...రెక్కలు తెగిన పక్షుల్లా నిలబడ్డ ఆ అరటి స్తంభాల పాలిటి మరొక రాక్షసుడుకూడా వున్నాడు. వాడు, 'వాడేవీడు' లాంటి మావంటవాడు—పేరు అప్పులు... పూర్తిపేరు అప్పలాచారి...మా అత్తగారే వాణ్ణి ముద్దుగా అప్పలూ అంటారు-మేమంతా వాణ్ణి చారీ, చార్లూ, చారూ, చారీ, వగైరా తోకపేర్లతో పిలుస్తుంటాం...అప్పులు,ఒట్టి ఆచారిమాత్రమే కాదు బ్రహ్మచారికూడా... తనను పెళ్ళాడాల్సిన మేనమామకూతురు పెళ్ళాడనని ఖచ్చితంగా చెప్పేసిందట... చెప్పడమే కాదు "అసలు నీలాంటి అడంగి వాడికి పెళ్ళి అనవసరం—ఏ పిల్లనో పెళ్ళాడి, దాని జీవితం నాశనంచేయక, ఎక్కడోచోట వంటచేసుకుని బ్రతుకు"—అని మా వాడికి సలహాకూడా యిచ్చిందట... "మరి పెళ్ళిలేకుండా జీవితాంతం బ్రహ్మచారిలా వుంటావుట్రా! ఎవరో ఒక పిల్లని చూసి పెళ్ళాడాలిగాని"...అంటూ మా అత్తగారు అంటే "నాకెవరు పిల్లనిస్తారమ్మ...నన్నెవరూ తెలిసినవాళ్ల యిళ్ళల్లోని పిల్లలుచేసుకోరు..."అని కండ్లు తుడుచుకునేవాడు మా అప్పులు ఆడదానిలా—

"ఛీ పిచ్చికుంకా! నీకేంరా విశేషంలా వున్నావు...వుండు నేను విచారిస్తాను ఏదైనా సంబంధంవుందేమో...అంటూ మా అత్తగారే అప్పులు పెళ్లి బాధ్యత అమాంతంగా నెత్తిన వేసుకున్నారు ఒకరోజు...

ఆనాటినుండీ అప్పులు మా అత్తగారియొక్క భక్తుడూ, భృత్యుడూకూడా—ఆమె కష్టపడకుండా అన్ని పనుల్లోనూ సహాయపడుతుండేవాడు—ఒక్క వంటపనిలో తప్ప.

ఆమె సంతోషిస్తుందని ప్రొద్దుటే పూజామందిరం ముందుకూర్చుని భక్తిగా సుప్రభాతం చదివేవాడు...

వంటయ్యాక మా అత్తగారి కెదురుగా కూర్చుని సంగీతం పాడేవాడు. యింతాచేసి చివరకు భోజనాలదగ్గిరి కొచ్చేసరికి అరిటాకుల విషయంలో మా అత్తగారిని మోసగిస్తుండేవాడు. ప్రతిరోజూ మా అత్తగారికంటే ముందేవెళ్ళి వుండేవాటిల్లో మంచి అరిటాకు కోసుకొచ్చుకుని దొంగతనంగా అటక మీద దాచేవాడు. వంటా గింటా ముగించుకుని తీరిగ్గా అరిటాకు కోసం కత్తి పట్టికెళ్లేవారు మా అత్తగారు... అంతకు ముందురోజు ఆమె చూసిన మంచి అరిటాకు కనబడేదికాదు... వెంటనే ఆవిడ పెరట్లోంచే గర్జించేది..."ఒరేయ్ అప్పలూ దొంగవెధవా! వున్న ఒక్క అరిటాకూ

కోసుకొచ్చావుట్రా .... యిప్పుడు నాగతే విట్రా!..." అంటూ

"ఆ. కోసుకోనిరాక ఏమ్ చేయమంటారు. మంచి ఆకులన్నీ మీరుదా కోసే నాగతీ చూసిదానే కావాల..." అని అప్పలు తనలో తను సణుక్కుంటూ వుండడం ఒకసారి వంటింటివేపువెళ్లిన నేను విన్నాను... అప్పలు నన్ను చూసి తెల్లబోయాడు... వెకిలినవ్వునవ్వుతూ మాట మార్చాడు... చూస్తిరా అమ్మా! పెద్దమ్మగారు నామీద నిందా అభాండం వేస్తారూ... ఆమెకోసందా అరిటాకు కోసికొచ్చి అడపామీద వుంచి వుంటె..."

నిజం మా అత్తగారికి తెలిస్తే అప్పలు డేంజర్లో పడతాడు... ఏదో సంబంధం చూసి అప్పలు పెళ్ళిచేయిస్తానంటున్న మా అత్తగారి ఔదార్యానికి మధ్య అరిటాకు పేచీవస్తే, అప్పలుకు పెండ్లికంటే ముందు "అంపకాలు" జరుగుతుంది... నేను చూసీ చూడనట్లు వినీ విననట్లు వూరుకున్నాను.

సుమారైన అరిటాకు కోసుకుని మా అత్తగారు వంటింటోకి వస్తూండగానే ఎటూ దొంగతనం బయటబడ్డదిగదా అని అటకమీద దాచిన అరిటాకును "మీకోసందా కోసి తెస్తినమ్మా" అంటూ ఎంతో శ్రద్ధాభక్తులతో మా అత్తగారికి సమర్పించాడు అప్పలు ... వెంటనే మా అత్తగారిముఖం అరిటాకంతయింది ... మంచి అరిటాకు దొరికిందన్న సంతోషంలో అప్పలుమీద కోపాన్ని మర్చిపోయి కృష్ణా అంటూ ఆకువేసుకుని భోజనానికూర్చున్నారు మా అత్తగారు—

అలవాటు ప్రకారం మా అత్తగారువీపు ప్రపంచంవేపుతిప్పి, తను గోడవేపు తిరిగి ఆకువేసుకు భోంచేస్తున్నారు.

ఆమె యెదురుగా వున్న గోడలో ఎవరైనా ఏ నరసింహావతారమో ఎత్తి ఆమె ఏం భోంచేస్తోందో తిలకిస్తే తప్ప మానవమాత్రులకు ఆమె ఏం వంటచేసుకుందో తెలియనివ్వదు.

పోనీ కమ్మని కరివేపాకు తాలింపు ఘుమఘుమలనుబట్టి అయినా ఆమె ఆపూట ఏం వంటచేస్తోందో పసికట్టవచ్చు కొంతవరకూ—యితర్లు ముక్కులదాకావస్తే మైలపడుతుందని మా అత్తగారు తను వేసే తాలింపును కూడా ఆచారపు హద్దుల్లో వుంచేది... కాని ఆమె భోంచేసేచోట వున్న మడి వూరగాయల జాడీల్లోనుంచి వచ్చే రకరకాల వాసనలనుమాత్రం ఆమె అరికట్టలేకపోయేది ... వంటింటి గడపదాటి ముందు హాల్లోదాకా ఏమిటేమిటో వాసనలు గుబాళించేవి మా అత్తగారి మడి వూరగాయల జాడీల్లోంచి ... ఒకసారి మా అత్తగారు

★ అత్తగారూ అరటికాయ పొడీ ★

భోజనానికి కూర్చున్నప్పుడే మా వారూ, భోజనానికి కూర్చోవడం తటస్థించింది.

మరి ఆవిడ భోజనానికి కూర్చోబోతూ ముడివూరగాయలుండే జాడీలు కదిలించారో ఏమో గుప్పున ఏవేవో వాసనలు మావారి ముక్కులదాకా దూసుకొచ్చాయి.

"అబ్బ ... ఏమిటీవాసన! బత్తాయిపండ్లు ఏ మేనా కుళ్ళిపోయాయా! ... కాదే... ఉండుండు ఏదో వాసన ... పెరటివేపు అంట్లు తోమేచోటు రోజూ పనిమనిషి శుభ్రంచేయడంలేదా! ... ఏంచేస్తున్నావ్ యింట్లో కూర్చుని ..." అంటూ నన్ను కోప్పడ్డారు మావారు.

అదేంకాదని నచ్చచెప్పేసరికి తల ప్రాణం తోక్కొచ్చింది. భోంచేస్తుండగానే మా వెనకనుండి మా యిద్దరి కంచాల్లోనూ ఏదో వల్లటిపదార్థం టప్పున పడ్డది.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాను. మా అత్తగారు ముసిముసి నవ్వులు నవ్వుతూ చేతిలో గిన్నె పట్టుకుని 'క్వశ్చన్‌మార్క్' లాగా నించున్నారు.

"ఏమిటమ్మా యిదీ?" అన్నారు మావారు వూరుకోక.

"కనుక్కోరా చూదాం.." అన్నారు మా అత్తగారు నవ్వుతూ.

"అబ్బో నీవంట ఏది ఏదో కనుక్కోడం నా చేత కానిపని" అన్నారు మావారు. నాకు నవ్వొచ్చి పొరబోయింది.

"పోనీ నువ్వైనా చెప్పవే చూదాం." అన్నారు మా అత్తగారు నా భుజంపట్టి కుదుపుతో ... విషమ సమస్య ... ఏం చెప్పేది! కంచంలో వడ్డించిన వెంటనే కమ్మటి వాసన రావడానికి బదులు అప్పుడే నాలుగు వర్షం కుంపర్లుపడి భూమి తడిసిన తర్వాత వచ్చే మట్టివాసన గుబాళిస్తోం దానల పదార్థంలోంచి.

పోనీ చింతపండా అంటేకాదు—కాకుండాను పోలేదు - చింతగింజ ఒకటే నేనున్నానని తొంగి చూస్తోం దా వల పదారంలోంచి...యిక చింతపండు పచ్చడే నని తీర్మానిద్దామా అంటే ఏవో తాళ్ళు తాళ్ళుగా కనిపిస్తున్నాయా పదార్థంలో. ఏదో ఒకటి చటుక్కున చెప్పేసి అత్తగారి ముందు అవమానం పాలు కాకూడదని నా బాధ.

"పోనీ నువ్వుకాస్త నోట్లో వేసుకుని రుచిమాసి చెప్పరా" అన్నది మా అత్తగారు కొడుకు నుద్దేశించి.

"అబ్బే అదెట్లా - నీ కోడల్ని అడిగావు ముందు నీకోడల్నే చెప్పమను...అదేం పదార్థమో తేలిందాకా నేను ముట్టుకోను" అని తప్పుకున్నారు దొంగ.

"యీలోపుగా మీ భోజనాలే పూర్తయ్యేట్లున్నాయే—"అన్నారు మా అత్తగారు.

"మరీ మంచిది...అసలా పదార్థం ఏమిటో నీ కోడలు కనుక్కుంటుందో ఓడిపోయానని ఒప్పుకుంటుందో కనుక్కో" అన్నారు మావారు నన్ను ఏడిపించడానికి.

"బాబూ నేను ఓడిపోయాను...నిజంగానే నాకు తెలీలేదత్తా" అన్నాను.

అంతవరకూ నవ్వు బిగబట్టుకుని వడ్డిస్తూన్న అప్పులు నేను ఓడిపోయాను అనేసరికి ముఫ్ఫయి రెండు గొగ్గిరి పండ్లూ బయటపెట్టి నవ్వాడు. "హాయ్యొ అదేం నిండాకష్టమని అమ్మగారూ... నన్ను చెప్పమంటురా! అపతార్థం ఏమని..!" అన్నాడు సింగరాయకొండలో పుట్టి శ్రీరంగంలో పెరిగిన మా అప్పులు—

"చెప్పరా-" అన్నారు మావారు; ఆ వల్ల పదార్థాన్ని మా అత్తగారు చూడకుండా అప్పడంకిందకితోస్తూ—అప్పులు నిర్లక్ష్యంగా నవ్వుతూ తేలిగ్గా "వెంకాయ పెచ్చెడి" అన్నాడు—ఫక్కున నవ్వేసరికి మావారికీ నాకూకూడా పొరబోయి దగ్గొచ్చింది—శబ్దంలేకుండా మూతిమీద వేలేసుకుని మా అత్తగారుకూడా కాసేపునవ్వి...

"ఒరే నీతాడు తెగా వెంకాయ కాదురా వంకాయ అని ఎన్నిసార్లు చెప్పాల్రా—యిన్నాళ్ళుగా మాయింట్లో వంట చేస్తూ యింకా నీకు తెలుగు సరిగావచ్చి అఘోరించలేదమిరా పిచ్చికుంకా..."అని మందలించారు - అప్పులు సిగ్గుపడ్డాడు—

"పోనీ యిప్పుడైనా తినండ్రా. పచ్చడి పేరు తెలిసిందిగా—"అన్నారు మా అత్తగారు—

"అయ్యో నాకు సయించదీ పచ్చడి-"అని తప్పుకున్నారు మావారు—

"అదేవిట్రా చిన్నప్పుడు ఆ చెంచు రాక్షసిచేస్తే తినేవాడివిగదూ యీపచ్చడి" అన్నారు మా అత్తగారు కొస్తచిన్నబుచ్చుకుని.

చెంచురాక్షసి అసలుపేరు చెంచులక్ష్మమ్మ మా అత్తగారి వినవాడబడుచు-ఎంతో మంచిదని మావారు చెబుతూంటారు. భర్తపోయాక మామామగారిదగ్గరే వుండి వంట వండి పెడుతూ మావారిని తల్లికంటే ఎక్కువగా సాకిందట. ఆమె పోవడం, మావారు కాలేజీలో చేరడం హోటలు భోజనం చేయడం అన్నీ ఒకేసారి జరిగాయట. వాళ్ళమ్మ వంటచేసి తను భోంచేసింది వేళ్ళమీద లెక్కించవచ్చంటారు మావారు... చెంచత్తమాట రాగానే మావారి ముఖం గంభీరం అయిపోయింది.

"నిజమే చెంచత్త వంకాయపచ్చడి చేస్తే ఎంతయినా తినేవాడిని...అరిటికాయ పొడి అంటే నాకెంతో ఇష్టమని తరచుగా అరటికాయ పొడి చేసిపెట్టేది"—అన్నారు మా వారు చిన్నప్పటిరోజులు జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

"ఓరి తిక్కన్నా...అరిటికాయ పొడి చేయడం ఏమంత భాగ్యంరా...నీకిష్టమని తెలిస్తే ఈపాటికి ఎన్నోసార్లు చేసిపెట్టే దాన్ని. రేపోమాపో చేస్తానే అరిటికాయ పొడి"...అన్నారు మా అత్తగారు ప్రేమతో.

మావారు హడలిపోయారు. "అబ్బే... ఒద్దమ్మా...వూరికే అన్నాను" అని తప్పుకోడానికి తంటాలు పడ్డారు.

మా అత్తగారు విడిచిపెట్టలేదు - "నీవు వూరికే అను, నిజంగా అను, మనఅరిటిచెట్టు కొత్తగా గెలవేసింది - మొదట మొదట ఆకాయలుకోసి నీకోసం అరిటికాయ పొడి చేయబోతాను—సరేనా?" అన్నారు మా అత్తగారు.

"యిప్పు డొద్దులేమ్మా ... ఎవరైనా



బంధువు లొచ్చినప్పుడు చేద్దువుగానిలే అరిటికాయ పొడి" ...అన్నారు మా వారు ఏమీ తోచక తికమక పడుతూ

"బాగుందిరా నువ్వనేది! అరిటికాయ పొడికోసం బంధువుల్ని రమ్మంటావా ఏమిటి తెలీకడుగుతా. అరిటికాయ పొడంటే నీకిష్టమన్నావు గనక నీకోసమే ముందొకసారి అరిటికాయపొడి చేస్తాను. చుట్టాలొస్తే మళ్లీ చేసుకోవచ్చు. అరిటికాయ పొడికేం భాగ్యంరా..."

ఆ సమయంలో మా వారి అవస్థ చూస్తే నాకే జాలి వేసింది...

మజ్జిగన్నంకూడా సరిగా తినకుండా చేయి కడుక్కోడానికి లేచారు ......

"అయినా మీ కెందుకు అనవసరంగా శ్రమ ...అప్పలుచేత చేయించండి అరిటికాయ పొడి..." అన్నాను మా వారిని ఆపదనుండి కాపాడ్డానికి.

"అయ్యో వెఱ్ఱిదానా! అప్పలికి అరిటికాయపొడికీ ఆరువందలమైళ్లు దూరం అని నీకుమాత్రం తెలీదా ఏమిటే! అయినా నాకేం శ్రమగనకా! నా కోసం కావాలంటే పొడిచేసుకోనూ!" ... అంటూ పచ్చడిగిన్నె అప్పలుచేతికిచ్చి పెరటివేపు వెళ్లారు మా అత్తగారు—

* * *

చేయి కడుక్కుని మూతి తుడుచుకుంటూ వచ్చిన మావారు నా చెవులో "త్వరగా చేయికడుక్కుని రా — నీతో ఒకమాట చెప్పాలి" అంటూ మేడమీది కెళ్లారు. చేయి కడుక్కుని అంట్లగిన్నెలు పనిమనిషికి వేయమని చెప్పి, పాందాను తీసుకుని పైకి వెళ్లాను.

ఏదో ఆలోచిస్తూ వాలుకుర్చీలో నడుం వాల్చి వాసాలు లెక్క పెడుతున్నారు మావారు—

నన్ను చూడగానే చివాలున లేచివచ్చి పాందానులోని వక్కపొడి కొంత తీసి నోట్లో వేసుకుంటూ—"చూడూ నిజంగానే రేపు మా అమ్మ అరిటికాయపొడి చేయబోతోందా" అన్నారు భయపడుతూ—

"ఆహా—ఆమె అన్నంతా చేసితీరుతుంది—మీరు తిన్నదాకా విడిచిపెట్టదు కూడా"—అన్నాను వచ్చే నవ్వు ఆపుకుంటూ—

"బాబోయ్ అయితే నేను రేపు ఇంటికి భోజనానికి రాను...నా స్నేహితు డెవడో గృహప్రవేశం కాబోతున్నాడు- వాడింటో భోంచేస్తాను రేపు-ఆ సంగతి మా అమ్మకు చెప్పు...ముందే చెప్పక-ఆమె అరిటికాయ పొడి చేశాక చెప్పు"—

నాకు నవ్వొచ్చింది మావారి చాదస్తానికి- "ఏమీ లాభంలేదు—రేపు తప్పించుకుంటే ఎల్లుండి! ఆ తర్వాత! అరిటిగెలలో కాయ లున్నన్నాళ్ళూ మీరుతప్పించుకోలేరు—" అన్నాను—

"ఆ గెలలో ఎన్ని కాయ లున్నాయేమిటి! నా ప్రాణానికి.." అన్నారు భయపడుతూ—

"కనీసం యిరవై, ముప్పయి—"

"చచ్చాన్రా దేవుడా—అంటూ వాలుకుర్చీలో కూలబడ్డారు—కాసేపుండి "ఆ— అయిడియా చూడూ! నేను చెప్పినట్లు చేస్తావా!" అన్నారు లేచి కూర్చుంటూ—

"ఏంచేయాలి! అన్నాను"

"మరేంలేదు. ఆ అరిటిగెల కోసేసి ఎవరికైనా దానం చేసెయ్...నన్ను రక్షించిన దానివవుతావ్" అన్నారు మావారు ప్రతిమాలుతూ.

"బాబోయ్! మీఅమ్మ బ్రతికుండగానే! ఆమె చూసిందంటే..."

"ఆమె చూడకుండానే ఆ గెలకోసి నా కారువెనక డిక్కీలో పడేయ్— ప్రొద్దుటే వెళుతూ వెళుతూ మన పక్కింటి భాస్కరం గారింట్లో పడేసిపోతాను..." అన్నారు

పోనీ అదేదో గృహప్రవేశానికి వెళ్ళాలన్నారుగా రేపు వాళ్ళింటికే పట్టికెళ్లండి"- అన్నాను.

"అది రేపు కాదులే...వచ్చే శుక్రవారం."

"మరి భోజనానికి వెళ్ళాలన్నారుగా రేపు..."

"ఏం! హోటళ్ళు లేవూ!"—

"అయ్యో ఏం ఖర్మం అండీ హోటల్లో భోంచేయడానికి...పోనీ దూరంగా వున్న తెలిసినవాళ్ళింటి కెవరింటికైనా పట్టుకెళ్ళి యివ్వకూడదూ ఆగెలను?

"ఏం పక్కింటివాళ్ళేం పాపం చేశారు!" అన్నారు మావారు—

"పొరపాట్న మీ అమ్మకు తెలిస్తే..."

"నిన్నెవరు చెప్పమన్నారు ఆమెకు- అంతగా గొడవచేస్తే గృహప్రవేశానికే పట్టికెళ్లానని చెప్పు...గృహప్రవేశం ఎప్పుడో, ఏమిటో ఆమె అడగొచ్చిందా ఏమిటి... ఏం! సరేనా," అన్నారు నా సమాధానం కోసం...

"అలాగే" అన్నాను. చివర్న మావారు చెప్పింది నచ్చింది.

"కానీ చీకటితో లేచి అరిటిగెల కోసి కార్లో పడేస్తాను...మరి మీ అమ్మ లేచే ముందే మీరు కారు తీసికెళ్ళిపోవాలి... లేకపోతే చిక్కొస్తుంది" అన్నాను తొమ్మిదింటికి నిద్రలేచే మా వారికి వార్నింగ్ యిస్తూ—

"ఓ యస్ ఆలాగే-అలారంపెట్టు ఆయిదింటికి...అన్నారు ఆవలిస్తూ—

* * *

మర్నాడు తెల్లారుగట్ల, అలారంమోతకు అదరిపడి లేచాను. మావారు మంచి గుర్రుపెట్టి నిద్రబోతున్నారు, అలారం పెట్టమన్న పెద్దమనిషి...అరిటిగెల కోసిందాకా మా వారిని లేపదల్చుకోలేదు...

చప్పుడుకాకుండా మేడదిగివెళ్ళి పెరట్లో ఓమూల గుడిసెలోవున్న తోటవాడు ఏడుకొండల్ని పిల్చాను నెమ్మదిగా 'ఎవరది' అంటూ గుడిసెలొంచి దూసుకొచ్చాడు ఏడు కొండలు...నన్ను చూసి కళ్ళు నులుపుకుంటూ "అమ్మగారా!" అన్నాడు ఖంగారు పడుతూ..."ఉస్...అరవక చూడూ కత్తి తీసుకుని నావెంటరా" అంటూ ముందుకునడిచాను డిటెక్టివ్ నవల్లోని విలన్‌లాగా...

ఏడుకొండలు కత్తి తెచ్చాడు అందంగా వున్న ఆ అరిటిగెల కోయించేసెయ్యడానికి నా మనస్సు ఎంతో బాధపడ్డది. ఆనాడు పితృవాక్య పరిపాలనకోసం పరశురాముడు తల్లిని నరికేసినట్లు భర్తృవాక్యపాలన కోసం

★ అత్తగారూ అరటికాయ పొడీ ★

నేనా అరటిగెలను కోయించక తప్పలేదు... కోయించిన గెలను కార్లో పెట్టించి మళ్ళీ చప్పుడు కాకుండా మేడమీది కెళ్ళాను... మావారు బ్రహ్మాండంగా గురక పెడుతున్నారు... యింక నేనే ఒక అలారం గాక తప్పలేదు...

పులిక్కిపడి లేచారు. "లేవండి త్వరగా అ అరటిగెల కోసేశాను."

'ఎందుకూ!' అన్నారు నిద్రమత్తులో...

'ఎందుకేమిటి! మీరేగా కోయించమన్నారు. త్వరగా లేచి తీసికెళ్ళి పక్కింటి వాళ్ళకిచ్చిరాండి...కార్లో పెట్టానుగెల—'

"అబ్బ..నీవే తీసికెళ్ళి యివ్వు...నన్ను డిస్టర్బ్ చేయక నిద్రోస్తుంది..."అని అటు తిరిగి పడుకున్నారు...

చచ్చాన్రా భగవంతుడా! కథ అడ్డం తిరిగింది—"చూడండీ-మిమ్మల్నే-మీఅమ్మ లేచే టైమయింది.. మీరు ఏమాత్రం బద్ధకించినా మీఅమ్మ చేయబోయే అరటికాయ పొడి తినాల్సివుంటుంది...యీరోజునుండి వరసగా గెలలో కాయలు అయిపోయిందాకా...'

"బాబోయ్....ఇదుగో లేచాను" అంటూ మావారు తేలుకుట్టినట్లు ఉలిక్కిపడిలేచారు... అప్పటికిగాని మావారి నిద్రమత్తు వదలేదు.

పెరటి వేపు తలుపుతీసిన చప్పుడైంది... నా గుండెల్లో రైళ్లు పరుగెత్తడం మొదలెట్టాయి...మా అత్తగారు లేచారు—పెరటి వేపు వెళుతూనే అరటిగెల కనిపించకపోతే, ఏడుకొండల్ని కేకేసి అడుగుతుంది. వాడు చెప్తాడు. నన్ను పిలుస్తుంది. "ఏమండోయ్ త్వరగా కారు తీసికెళ్ళండి.. మీ అమ్మ లేచారు" అన్నాను ఖంగారుపడుతూ.

"అయ్యొయ్యొ - యిదుగో వచ్చేశాను" అంటూ ముఖం కడుక్కుని చొక్కా వేసుకొని గబగబ మెట్లుదిగి కిందికెళ్ళారు. బెడ్ కాఫీ తీసుకుని అప్పలు ఎదురయ్యాడు...

ఛీ! ఛీ! వెధవ శకునం...పోయిందిరా యీ రోజంతా ఖరాబ్ నీ శకునంతో అంటూ నాలుగడుగులు వెనక్కి వచ్చి, తిరిగి మెట్లు దిగి, కారుతీసుకొని గేటు బయటకు వెళ్ళిపోయారు మావారు.

ఉన్నట్లుండి మా అత్తగారి కేకలు మేడ మీదకు వినిపించాయి...వచ్చాను యిక నన్ను పిలుస్తుంది...పిలుస్తుందేమిటి...పిలిచింది. "వస్తున్నానత్తా" అంటూ బల్లో కెళ్ళినట్లు పెరటివేపు వున్న మా అత్తగారి దగ్గరికెళ్ళాను.

"అదికాదు! అరటిగెల అంత తెల్లారుగట్ల కోయించాల్సిన అవసరమేమొచ్చింది. కార్లో పెట్టించావట్నే! ఎందుకూ! అసలు కారేదీ"

"మీ అబ్బాయే తీసికెళ్ళారు..."

"మరి కార్లో నీవు అరటిగెల పెట్టిన సంగతి వాడికి తెలుసా?

"ఆ... ఆయనే కోయించి కార్లో పెట మన్నారు. తన స్నేహితుడింట్లో యీరోజు గృహప్రవేశం అట...తీసికెళ్ళారు వాళ్ళకు యివ్వడానికి"...అన్నాను నీళ్లునములుతూ...

"అయ్యొ నెత్తిరాత! శ్రావణశుక్రవారప్పూటా తొలిసారి వేసిన నిక్షేపం లాంటి అరటిగెలను నీ వెట్లాకోసిచ్చావు- వాడెట్లా తీసికెళ్ళాడూ! ... హవ్వ ... అయినా నీవు నన్నెందుకు లేపలేదూ!"...

ఏం చెప్పేది! ... తలవంచుకుని మాట్లాడక వూరుకున్నాను...

అప్పలు చేతులు కట్టుకుని వినయంగా మా అత్తగారిముందు నిలబడ్డాడు...

ఏడుకొండలు అరటిచెట్టు పక్కనే నిలబడ్డాడు తలవంచుకుని దోషిలాగా...

"యింకా చూస్తూ నిలబడ్డావేమిట్రా! గెలకోసిన వెంటనే అరటిచెట్టు కొట్టేయ్యాలని తెలీదూ!"...అని గర్జించారు మా అత్తగారు...

అరటిచెట్టు మొదలంటా నరికేసి పూచలు తీసుకొచ్చి మా అత్తగారి ముందుంచాడు.

"ఎందుకూ యివి! అఘోరించడానికా! తీసికెళ్లి దిబ్బలో పారెయ్ ... బంగారంలాంటి అరటిగెల వూళ్ళో వాళ్ళకిచ్చి యీ బోడి పూచలు తింటానికా ఇన్నాళ్లూ పెంచిందా అరటిచెట్టును!...ఛీ ఛీ...మనుషులకు బుద్ధి, జ్ఞానం అంటూ వుండాలి ... అసలన్నీ వాడి- కొతండ్రిబుద్ధులే వచ్చాయి ... ఆయనా అంతే ... వార్ధం, వర్జం చూడకుండా, ఏదంటే అది యింట్లోనుంచి తీసికెళ్ళి వూళ్లోవాళ్ళ కిస్తూండేవారు ... అయినా మాట్లాడో పోట్లాడో ఇది మంచీ, యిది చెడూ, అని చెప్పాలిగాని మరీ మొగుడు ఏది చెబితే దానికంతా తాళం వేస్తూంటే ఎటా! యిదుగో యిట్లాగే వుంటుంది..." అంటూ నాకో రెండు చురకలు తగిలించారు మా అత్తగారు ... తల ఒగ్గాను... వాళ్లబ్బాయికోసం...

ఆ పూట వంట ఆలశ్యంగానే ఆరంభించారు మాఅత్తగారు...కొడుకువస్తే నాలుగు చివాట్లేసి అడగాలని చాలాసేపు ఎదురు చూసిందామె...

మా వారూ రాలేదు, కారూ రాలేదు...

పన్నెండు గంటలయినా మావారు రాలేదు. బహుశా వాళ్ళమ్మకు భయపడి ఏ స్నేహితుడింటికో వెళ్ళి వుంటారనుకున్నాను.

* * *

గేటు బయటే కారు ఆపి, చప్పుడు కాకుండా మేడమీదికెళి, ఒక నిద్రపోయి లేచి, తాపీగా స్నానం గీనం ముగించుకుని, బట్టలు మార్చుకుని, కాఫీ కూడా అడక్కుండా, వాళ్ళమ్మ కంట బడకుండా వుంటే చాలని అడుగులో అడుగేసుకుంటూ మెట్లు దిగివస్తున్నారు మావారు... నేను ఎదురయ్యాను...

"అలా గేరా...వెనక్కి వెళ్లకు...మంచి శకునం...చూడూ మా అమ్మ ఇప్పుడెక్కడుంది! కేక లేసిందా!..."అన్నారు రహస్యంగా...

"అదంతా ఎందుకు అడుగుతారు లెండి ....యింతవరకూ మీకోసం కాచుకున్నది మీరు వస్తే నాలుగు చివాట్లేసి అడగాలని... ఇప్పుడే వంటచేసుకోడానికి వెళ్లింది లోపలికి."

"బాబోయ్...అయితే నన్ను త్వరగా వెళ్లనీ..."

"అయితే యింతకీ మీ భోజనమో?"

"హోటల్లో...

"అమ్మో ఏం గ్రహచారమండీ! అరటికాయలు లేవుగా యింట్లో! యీ పూట యింట్లో భోంచేయండి..." అన్నాను బ్రతిమాలుతూ...

"అబ్బ చెప్తే వినవుగద! అసలే మా అమ్మ కోపంగా వుంటుందీరోజు...ఆమె వెయ్యబోయే ప్రశ్నలన్నింటికీ అబద్ధాలు చెబుతూ కూర్చోవాలి...నాచేత కాదు—మా అమ్మ అడిగితే—వుందిగా గృహప్రవేశం—అక్కడికే వెళ్లానని చెప్పు..."

"ఆ...నాకిదే పని... నేనేనా తీరిగా మీకోసం అబద్దాలాట్టాని కూర్చున్నాను... మీ అమ్మచేత చీవాట్లు, సూటిపోటి మాటలు నేను తినలేను...అంతకన్నా అరటి కాయ పొడేనా తినొచ్చు.....అయినా ఇవాళ కాపోతే రేపు మాత్రం మీరామె కంటబడరా!"...అన్నాను.

"రేపటికి ఆమెకోపం చల్లారిపోతుందిలే —అంటూ మెట్లుదిగి హాల్లోకెళ్లారో లేదో

21 JEWELS
WATERPROOF
LEVER WATCH
SHOCKPROOF
DUSTPROOF
Centre Second
Radium Dial
GTD. 6 YEARS
21 Jewels chrome steel back--Rs. 75/-
21 Jewels R/gold 20 Microns-Rs. 85/-
PIONEER WATCH CO.
PO BOX NO 11428, CALCUTTA-6

సాక్షాత్ తిరుపతి వెంకటేశ్వరస్వామిలాగా పట్టెనామాలతోనూ, చేతిలో సంచితోనూ, ప్రత్యక్షమైనారు మా బావగారు "ఏంరా! అంతా ఖులాసాయేనా!" అంటూ...మా వారు గురుక్కుమన్నారు..."రా అన్నయ్యా యిదేనా రావడం! యింటిదగ్గర వదినె పిల్లలూ అంతా ఖులాసాగా వున్నారా!" అంటూ వాళ్లన్నయ్యను హాల్లోకి ఆహ్వానించారు. ఎవరో అనుకుని లోపలికెళ్లిపోయిన నేను మా బావగారి గొంతు గురుపట్టి హాల్లోకొచ్చాను. నన్ను చూస్తూనే "ఏమ్మా బాగున్నావా! మీ అక్కయ్య నిన్ను చాలాచాలా అడిగినట్లు చెప్పమన్నది...పిల్లలంతా నిన్ను చూడాలని కలవరిస్తున్నారు!..." అన్నారు. అవును బావగారూ యింతవరకూ వాళ్లను మా యింటికి తీసుకురానేలేదు. పోనీ యీ సారైనా తీసుకురాకపోయారా అక్కయ్యనూ పిల్లల్నీ...అన్నాను... "ఎక్కడమ్మా నా వుద్యోగంతోనే సరిపోతోంది—యీ సారీ ఆఫీసుపనిమీద వచ్చాను. నాలుగు రోజులు లీవులో—అలాగే మిమ్మల్నీ చూసి వెళ్లవచ్చుననుకున్నాను...అన్నట్లు కక్క ఏదీ కనబడదేం!" అన్నారు మా అత్తగారికోసం వెదుకుతూ...

"ఆమె వంటింట్లో వున్నారు...పిలుస్తాను"...అంటూ మా బావగారికి కాళ్ళకు నీళ్ళుకూడా తేవడానికి పెరటి వేపు వెళ్ళాను...

అప్పుడే అరిటాకుకోసం కత్తిపట్టుకుని బయలేరారు. మా అత్తగారు. బావగారొచ్చారన్నాను.

"ఎప్పుడూ! యింత పొద్దెక్కి ఏంబండి వుందీ"

"ప్రొద్దుటే వచ్చాగులావుంది. బహుశా, సాకమ్మవాళ్ళింటికివెళ్ళి వచ్చివుంటారు. అందుకే ఆలస్యమైందనుకుంటాను" అన్నాను.

"అయితే భోంచేయలేదన్నమాట!... అయ్యో కత్తిరాతా...యీపూట ఆ అరిటిగెలే వుంటే లక్షణంగా పొడిచేసేదాన్ని...వాడికూడా అరిటికాయ పొడి అంటే ఎంతోయిష్టం అని మా తోడికోడలు చెప్తుండేది... ఈ పూట వట్టి పత్యం మెతుకులు పెట్టాల్సిందే వాడికి—అరిటిగెల గొడవలో ఈ పూట అప్పులు కూరగాయలు తీసుకురాలా మార్కెట్ నుంచి-ఒట్టి సాంబారుచేసి అప్పడాలు వేయించాడు— నేనూ ఒటి పచ్చడి మెతుకులు చేసుకున్నాను—యిప్పటికే పన్నెండు దాటింది. ఇప్పుడిక కూరగాయలు మార్కెట్ నుంచి తెప్పించీ, వంటచేసీ, వాడికి ఎప్పుడు అన్నంపెట్టడం! అన్నట్లు నీ మొగుడు గృహప్రవేశానికి వెళ్లాడన్నావుగదూ!...ప్రొద్దున కారు తీసికెళ్లినవాడింకా రాలేదేం? అక్కడే భోంచేసి వస్తాడా ఏకంగా"?—అన్నారు మా అత్తగారు.

"అబ్బే లేదు-ఇప్పుడే ఆయన వచ్చారు-వెనకాలే బావగారూ వచ్చారు"-అన్నాను.

"అయ్యో కత్తిరాతా!...ఈ పూటే ఇంట్లో కూరగాయలు లేకుండాపోవాలా! సరేనీవువెళ్ళి సింహాడికి కాళ్ళకు నీళ్ళిచ్చిరా. నేనేదో తంటాలుపడతాను"—అంటూ పెరటి వేపు వెళ్లారు మా అత్తగారు-బ్రతికాం అనుకుని మా బావగారి కాళ్ళకు నీళ్ళు తీసుకెళ్లాను.

"కక్క భోంచేస్తోందా!" అన్నారు మా బావగారు"—లేదండీ మీరు భోంచేశాకే చేస్తుందట అన్నాను.

"అట్లాగా!...అయితే లేవరా పాపం కక్క మనకోసం కాచుకున్నట్లుంది"... అన్నారు మా బావగారు లేవబోతూ—నా గుండె గతుక్కుమంది. మా అత్తగారి వుత్తరువు లేందే వీళ్ళు భోజనానికి వెళ్లడానికి లేదు—ఆవిడ ఏదో తంటాలు పడతానంది మరి ఇంకాసేపు పడనిస్తే మంచిదనుకుని "లేదు బావగారూ ఆమే పిలుస్తానన్నారు" అన్నాను. "అయితే సరే-నాకేం తొందర లేదు—ప్రొద్దుటే తిన్న టిఫిన్ ఇంకా అరగలేదు—కక్క కోసం చెప్పాను"— అన్నారు.

"అవునూ అమ్మను భోంచేయమని చెప్పు- అప్పులున్నాడుగా వడ్డనకు? ఇంకా ఆమెందుకూ!" అన్నారు మా వారు—కొంపతీసి వాళ్ళమ్మ ఏ పదార్థమైనా వడ్డించడానికి వస్తుందేమోనన్న భయంతో— "ఆమే స్వయంగా మీకు వడ్డిస్తారట." అన్నాను మావార్ని ఏడిపించడానికి.

"అదేమిటే! భోంచేసిందాకా. అమ్మ మడిలో వుంటుందిగా!" అన్నారు మావారు యింకా సందేహనివృత్తికాక...

"వుంటారు...అప్పులు వడ్డిస్తుంటే పర్యవేక్షణ చేస్తారు. ఆమె ఏదైనా పచ్చడీ పులుసూచేస్తే మీ కంచాలో ఎత్తి పడేస్తారు." అన్నాను...మా బావగారు పక్కన నవ్వారు...మావారు నన్ను నమిలిమింగేట్లు చూసి మరుక్షణం తనూ నవ్వేశారు—

ఆమాటా యీమాటా మాట్లాడుతూండగానే ఒంటిగంటయింది...లోపల్నుంచి మాఅత్తగారి పిలుపొచ్చింది—నాకోసం... వెళ్లాను వంటింట్లోకి—"చూశావుటే! నా మనసులో ఏదైనా అనుకుంటే అట్లాగే జరుగుతుందని మా అవ్వ అంటుండేదని అప్పుడప్పుడు నేను నీతో అంటుంటాను జ్ఞాపకంవుందా!...యింతకూ ఖమైన అరిటికాయ పొడిచేశాను" అన్నారావిడ సంబరపడిపోతూ.

"ఆ!" అన్నాను గుడ్లు తేలేసి...నోట మాట రాలేదు నాకు—యిందాకట్నుంచీ ఆమె పడుతున్న తంటాలు యిదేనా? "అయినా ఎక్కడివి అరిటికాయలు" అని అడిగాను వుండబట్టలేక—

"పక్కంటి భాస్కరం భార్యను మన పిట్టగోడమీదనుంచి కేకేసి, చుట్టాలొచ్చారు, యిట్లా అసందర్భం అయిపోయింది, వేళా మించిపోయింది; కాబట్టి ఏవేనా కూరగాయలు మిగతావుంటే కాస్త యిమ్మన్నాను...లోపల్నుంచి అయి ఖమైన అరిటికాయలు తెచ్చియిచ్చింది ... చెప్పే నమ్మవేమో మన అరిటిగెల్లో కాయల్లాగే నవనవలాడుతూ చూడముచ్చటగా వున్నాయి...యివిగో యింకా మూడు కాయలెత్తిపెట్టాను"...అంటూ మిగతా అరిటికాయలు చూపించారు మా అత్తగారు.

—ఏం చెప్పేది!...భూమి 'గుండ్రముగానుండును' అన్నట్లు తిరిగి మా యింటికే వచ్చాయి గెల్లో కాయలు...మంచివేళ. భాస్కరంభార్య అసలు విషయం చెప్పలేదు మా అత్తగారితో...బ్రతికించింది... బహుశా మా వారు వాళ్ళమ్మకు తెలీనివ్వద్దని 'పాలిసీడీ'గా చెప్పివుంటారు— ఆయన దేన్నుండి తప్పించుకోవాలని తంటాలుపడ్డారో. ఆ అరిటికాయ పొడి విశ్వరూపం ధరించింది...

నేను దిగులుగా నిలబడివుండటం చూసిన మా అత్తగారు హుషారుగా "ఏమిటే అట్లా దిగాలుపడి నిలబడ్డావు! మన అరటిగెల పోతే పోయింది.....పక్కంటివాళ్ళ పుణ్యమా అంటూ మంచి అరటికాయలు దొరికాయి సమయానికి...నీ మొగుణ్ణీ, సింహుణ్ణీ భోజనానికి రమ్మను...ఒరేయ్ అప్పులూ, వాళ్లిద్దరికీ వడ్డించరా" అన్నారు.

అరిటికాయ పొడి మా అత్తగారు చేశారన్న విషయం తెలిస్తే మావారు అసలు భోజనానికి కూర్చోరేమో! మళ్ళీ నాకు విషమ సమస్యయింది.

హాల్లోకెళ్లాను..."అత్త భోజనానికి పిలుస్తోంది" అన్నాను నెమ్మదిగా.

"మేము ఎప్పుడో రెడీ.....లేవరా" అంటూ పైన తువ్వాలు వేసుకుని మా బావగారు లేచారు. మా వారు నన్ను చూసి, వాళ్ళమ్మ ఎక్కడుంది! అరటిగెల సంగతి మళ్ళీ ఏమైనా గొడవ చేస్తుందా! ఏమైనా

కలవరపడు స్త్రీలకు

"కుమారి" మాత్రలు మరువకండి మీ ఆరోగ్యం రక్షించును.చింతఅవసరం
వెల (సాదా) రు. 3/-
(స్పెషల్) రు. 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజిప్యాకింగుప్రత్యేకం

DEVEE & CO. (A.P.) Calcutta-40.d

★ అత్తగారూ అరటికాయ పొడీ ★

వడ్డించబోతోందా! ఏం 'మూడ్'లో వుంది. కోపంగా వుందా! యిత్యాది ప్రశ్నలన్నీ భరతనాట్య భంగిమల్లో, సైలెంట్ గా అభినయించారు. అన్నిటికీ చిరునవ్వునవ్వి వూరుకున్నాను...ఏం చెప్పినా చిక్కే...

భోజనానికి కూర్చున్నారు అన్నదమ్ములిద్దరూ..."ఏంరా, సింహం!... ఎన్నాళ్లకొచ్చావ్! మమ్మల్నంతా మర్చిపోయినట్టున్నావే!" అంటూ చేతిలో అరిటికాయపొడిగిన్నె ధరించి రంగంలో ప్రవేశించారు మా అత్తగారు. ఎక్కడ అరటిగెల సంగతి వస్తుందోనని భయంతో తలవంచుకుని కూర్చున్నారు మావారు...

"ఎక్కడ కక్కీ...పిల్లల్లోనూ, నా వుద్యోగంలోనూ సరిగ్గా వుంది. పెద్దపిల్ల పెళ్లీడుకొచ్చింది; రెండవ వాడికి టైఫాయిడ్ వచ్చి యిప్పుడే లేచి తిరుగుతున్నాడు...చంటిదానికి ఎప్పుడూ ఏదో జబ్బు - నీకు తెలీందేముంది! యిల్లు కదలడానికి అవకాశమేది!" అన్నారు బావగారు.

"మరి సంసారం అన్న తర్వాత వుండవ్రటా! నీవంటే మా అబ్బాయి ఒక్కడే కొడుకువుగనక రాజులాగా పెరిగావు— మరి నలుగురు పిల్లలూ జల్లలూ అన్న తర్వాత మాటలా, ఏదో సామెత చెప్పినట్లూ... ఒరేయ్ అప్పులూ అన్నం వడ్డించరా వాళ్లిద్దరికీ—" అని ఆజ్ఞాపించారు మా అత్తగారు- మావారు యింకా వాళ్ళమ్మ చేతులో గిన్నె చూడలేదు—అప్పులు అన్నం వడ్డించిన వెంటనే వార్నింగు లేకుండా మా అత్తగారు అరిటికాయపొడి వడ్డించేశారు.

మావారు గతుక్కుమన్నారు...

కాని ఆమె ఏమి వడ్డించిందో పసికట్టలేకపోయారు...

మా అత్తగారి వంటలో అదొక విశేషం. వడ్డించిన వెంటనే ఫలానా అని కనుక్కోడం బ్రహ్మతరం కాదు—

"యిదేమిటికక్కీ!"...అన్నారు మాబావగారు పొడిని పరీక్షిస్తూ...

"అయ్యో తొక్కన్నా! ఏమిటని అడుగుతావేమిట్రా! అరిటికాయ పొడిరా!..." మావారు ఉలిక్కిపడ్డారు...నావైపు కోపంగా చూశారు...నేను తలుపు వెనక్కి తప్పుకున్నాను...

"నీకూ వాడికీ యిష్టమనే చేశాన్రా అరిటికాయపొడి—ఏమిటో వేళమించిపోయిందని అదరా బదరా చేశాను—ఎట్లా వుందో ఏమో"—అంటూ వంటింట్లో కెళ్ళారు మా అత్తగారు—

"అదేమిటికక్కీ—మా కోసం యీ వేళప్పుడు నీవు కూడా భోంచేయకుండా యీ మాత్రం చేసిందే ఎక్కువ...యింకా ఎట్లా వుంటం ఏమిటి నీవు చేస్తే బాగుండకుండా వుంటుందా?"—అంటూ మా బావగారు అరిటికాయ పొడి కాస్త నోట్లో వేసుకున్నారు- తత్ క్షణం-గరగరా, గరగరా, అ వేళబ్బం బయులుదేరింది మా బావగారి నోట్లోంచి.

"ఏమిటన్నయ్యా..."అన్నారు ఖంగారు పడుతూ మావారు...

"అబ్బే...ఏమీ లేదురా...యీ అరిటికాయ పొడి వుంది చూశావూ...కాస్త జాగ్రత్తగా చేయాలి...ఏమాత్రం అజాగ్రత్తగా చేసినా కష్టం..."అంటూ గ్లాసుడునీళ్లు నోట్లో పోసుకుని గర గర శబ్దాన్ని గలగరించి మింగారు మాబావగారు...

"యిదుగో-యీపొడి బాగా కుదిరిందిరా—వేడివేడిగా కూడా వుంది. కాస్త తిని చూడండి" అంటూ మా అత్తగారు వంటింట్లోంచి మరికాస్త అరిటికాయపొడి తీసుకొచ్చి ఒద్దంటున్నా వినకుండా బలవంతంగా వడ్డించింది అంతవరకూ మావారు కతానే లేదు అరిటికాయపొడి...

ఎంతో ఆప్యాయంగా మా అత్తగారు రెండవసారి వడ్డించిన అరిటికాయపొడిని విధిలేక భయపడుతూ కాస్త నోట్లో వేసుకున్నారు మాబావగారు. అన్నగారేమైనా అనుకుంటారనో ఏమో మావారూ ధైర్యం చేసి కాస్త పొడినోట్లో వేసుకున్నారు... ఈసారి కరకరా, కరకరా, శబ్దాలు బయలుదేరాయి-ఒక్క క్షణం నోరుమూసుకుని అన్నదమ్ములిద్దరూ ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు.అశబ్దాలు ఎక్కణ్ణించి వస్తున్నాయీ అని. వాళ్లిద్దరినోట్లోనుంచే వస్తున్నాయని గ్రహించినవెంటనే గబుక్కున చెరో గ్లాసుడునీళ్లు నోట్లోపోసుకుని అకరకరాశబ్దాన్ని మింగేశారు...

మా అత్తగారు మూతిమీద వేలేసుకొని వాళ్లిద్దర్నీ ఆశ్చర్యంగా చూస్తూ—"ఇదేమిట్రా! అరిటికాయ పొడి తింటానికి యింత అవస్థపడుతున్నారు!" అన్నది.

"అబ్బే...లేదు కక్కీ...అరిటికాయ పొడి తింటానికి అవస్థేముందీ?" అన్నారు మా బావగారు గ్లాసు కిందపెడుతూ.

"మరేమయినా రాళ్లు రప్పలున్నాయా?"

"అబ్బే, అవుంటే దొరికిపోతాయి— సాధారణంగా వేపుడులో కలిసిపోయేవి బొగులు; తాళింపులో కలిసిపోయే వాటిల్లో ఆవాల్లోని ఇసక....ఇవి రెండూ కాస్త జాగ్రత్తగా చూడకపోతే చిక్కు—అంతే" అన్నారు బావగారు.

"ఏమోరా! అన్నీ సరిగానే చూసి వేశానే! నేనుకూడా కాస్త నోట్లో వేసుకుని రుచి చూశాను...మరి నువ్వనే ఇసకా బొగ్గులూ నా నోటికి తగల్లేదు!" అన్నారు మా అత్తగారు.

"దానికో కారణం వుంది కక్కీ...మాకు పండ్లు వున్నాయి...గనక నమిలాం...నీకు పండ్లు లేవు గనక మింగేసుంటావ్. అందుకే నీకు తెలీలేదు అరిటికాయ పొడిలో అరిటికాయ కాక యింకా ఏమేమున్నాయో..." అన్నారు మా బావగారు మావారితో బాటు మజ్జిగన్నం కలుపుకుంటూ...తలుపు వెనక వున్న నేను నవ్వు ఆపుకోలేక తంటాలు పడ్డాను.

"అయ్యో నా తిరాతా...యింతకూ ఇద్దరూ తినలేదేమిట్రా అరిటికాయ పొడి! అంటూ దవడలు నొక్కుకున్నారు ఆశ్చర్యంగా మా అత్తగారు.

"అదేమిటి కక్కీ..."గంగగోవు పాలు గంటెడైనను చాలు" అన్నట్లు, ప్రేమతో వడ్డించింది ఏ కాస తిన్నా తిన్నట్లే... అన్నారు మా బావగారు...కక్కీ మనసు కష్టపడటం ఇష్టంలేక.

"పోనీ రేపుమళ్ళీ చేసిపెడతాన్లేరా అరిటికాయ పొడీ అన్నీ జాగ్రతగా చూసీ..." అన్నారు మా అత్తగారు.

"అబ్బే...ఎందుకక్కీ-యీ సాయంత్రం బండి కెళ్ళిపోతున్నాను..."అన్నారు చేయి కడుక్కోడానికి లేస్తూ.

"అదేమిట్రా ఇంత తొందరగా నా వెళ్తావు!" అన్నారు మా అత్తగారు ఆశ్చర్యంగా.

"అవును కక్కీ...అర్జెంటు పనులున్నాయి...ఏమీ అనుకోవద్దురా" అన్నారు మావారివైపు తిరిగి.

"అబ్బే...నీ పనులాపుకుని వుండమంటానా! తీరుబడి చూసుకుని మళ్లీ వద్దువుగానిలే అన్నయ్యా" అన్నారు మావారు—మళ్ళీ అన్నగారికోసం వాళ్ళమ్మ చేసే అరిటికాయ పొడి తినాల్సొస్తుందన్న హడలుతో.

"అయినా నాలుగురోజు లుంటానన్న మా బావగారికి అర్జంట్ పనులన్నీ అనుకోకుండాం రావడానికి కారణం మా అత్తగారా?...అరిటికాయ పొడా? ★

RATNAM'S 'N' OIL
సేవించిన పూర్తి సంతోష సౌఖ్యము లనుభవించగలరు. 1 సీసా రూ. 11-4-0.
ఎడ్వాన్సుతో జాబు వ్రాయండి.
డాక్టర్. రత్నం సన్స్,
మలకపేట బిల్డింగ్స్, హైద్రాబాదు 2.